ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 17.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో సన్నధాన్యం పండించిన రైతుల శ్రమను గుర్తిస్తూ క్వింటాకు **500 రూపాయల చొప్పున** బోనస్ చెల్లిస్తున్నామని, దీనివల్ల ఒక్కో రైతుకు దాదాపు **25 వేల రూపాయల** అదనపు ప్రయోజనం కలుగుతుందని శాసనభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

2. మహిళా సంఘాలకు గత రెండేళ్లలో **57 వేల కోట్ల రూపాయల** రుణాలు ఇప్పించడంతో పాటు **1,390 కోట్ల వడ్డీ** చెల్లించామని రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.

3. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న గవర్నర్, శాసన సభాపతి సాక్షిగా వందేమాతరం గేయానికి అవమానం జరిగేలా మజ్లీస్ నేతలు ప్రవర్తించడం దురదృష్టకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.

4. రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది.

**శాసనసభ**

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈరోజు అత్యంత వాడీవేడీగా సాగాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, మహిళా సాధికారత, రైతుల సంక్షేమంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చను ప్రారంభించిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కే.తారక రామారావు, కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు

విమర్శలు చేశారు. గత పదేళ్లలో దేశంలోనే అత్యుత్తమంగా ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థ, నేడు దారం తెగిన గాలిపటంలా మారిందని విమర్శించారు. తారక రామారావు చేసిన విమర్శలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు.

డెస్క్

<u>**ఉప ముఖ్యమంత్రి**</u>

శాసనసభ వేదికగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యంగా రైతులకు వరి ధాన్యంపై బోనస్, మహిళా సాధికారత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆయన కీలక ప్రకటనలు చేశారు. సన్నధాన్యం పండించిన రైతుల శ్రమను గుర్తిస్తూ క్వింటాకు 500 రూపాయల చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని, దీనివల్ల ఒక్కో రైతుకు దాదాపు **25 వేల రూపాయల** అదనపు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతు భరోసా కింద 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన సభకు తెలిపారు.

డెస్క్

<u>**అసెంబ్లీ సీతక్క..**</u>

మహిళా సంఘాలకు గత రెండేళ్లలో **57 వేల కోట్ల రూపాయల** రుణాలు ఇప్పించామని, **1390 కోట్ల వడ్డీ** చెల్లించామని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ఈరోజు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు చెల్లించాల్సిన **3 వేల కోట్ల వడ్డీని** ఎగ్గొట్టిందని, అభయహస్తం నిధులను కాజేసిందని తీవ్రంగా ధ్వజమెత్తారు. హామీలను నెరవేర్చని వారు తమను ప్రశ్నించడం విడ్డూరమని, ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సీతక్క పునరుద్ఘాటించారు.

డెస్క్

**ఇండియా పోస్ట్:**

భారత పోస్టల్ విభాగం ఈరోజు మూడు కొత్త సర్వీసులను ప్రారంభించింది. 24 స్పీడ్ పోస్ట్, 48స్పీడు పోస్ట్, 24 స్పీడ్ పార్సిల్ పేరుతో మూడు సేవలను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్యా సింధియా, సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని ఈరోజు ఢిల్లీలోని ఆకాశవాణి భవన్లో ప్రారంభించారు. వర్చువల్ గా జరిగిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ పోస్టల్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని భారతీయ విద్యా భవన్ వేదికగా వీక్షించారు. తొలివిడతలో ఆరు మెట్రో నగరాల్లో ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సింధియా మాట్లాడుతూ...

బైట్ - జ్యోతిరాదిత్యా సింధియా

మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... కొత్త సర్వీసులలో OTP ట్రాకింగ్, జియో ట్రాకింగ్ సిస్టం అందుబాటులో ఉంటుందన్నారు.

బైట్ - చంద్రశేఖర్ పెమ్మసాని

హైద్రాబాద్ లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ వీణ కుమారి, హైదరాబాద్ పోస్ట్ మాస్టర్ జనరల్ సుమిత అయోధ్య, హెడ్ క్వార్టర్ పోస్ట్ మాస్టర్ జనరల్ విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

- GS/RNU/HYD

**బండి సంజయ్**

రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న గవర్నర్, శాసనసభాపతి సాక్షిగా వందేమాతరం గేయానికి అవమానం జరిగేలా మజ్లీస్ నేతలు నిబంధనలు ఉల్లంఘించడం దురదృష్టకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. 2026లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం తప్పనిసరి అని, దానిని అవమానించిన మజ్లిస్ సభ్యులకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని,

శాసనసభాపతిని ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్ మిత్రపక్షం అనే కారణంతోనే ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి వెనకాడుతోందని బండి సంజయ్ ఆరోపించారు.

డెస్క్

**<u>రామచందర్ రావు</u>**

శాసనభలో వందేమాతరం ఆలాపన సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేల వాకౌట్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఖండించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ గేయాన్ని అవమానిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుచేటని, ఇది బుజ్జగింపు రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. అలాగే, ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను తప్పుబడుతూ... రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక విధులను ప్రభుత్వం విస్మరిస్తోందని అన్నారు.

డెస్క్

**MULUGU DIST**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు ములుగు జిల్లా ఏటూరునాగారంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత ఐసిడిఎస్ ప్రాజెక్టు కింద అమలయ్యే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..

సౌండ్ బైట్ ...

పిటిసి, ములుగు

**<u>నిర్మల్ జిల్లా</u>**

యువతీ, యువకులందరూ స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని నిర్మల్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ సూచించారు. ఈరోజు జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ

సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంఈజీపి ముద్ర వంటి పథకాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని విద్యార్థులను కోరారు.

పిటిసి, నిర్మల్

**వాతావరణం**

రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రేపు, ఎల్లుండి వర్షాల తీవ్రత పెరిగి, రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ శాఖ వెల్లడించింది. వర్షాల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 3 నుండి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది.

ప్రెస్ నోట్